## క్లుప్తంగా

### ఉగ్రదాడి మృతులకు ఘన నివాళి



పహల్గామ్ మృతులకు నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పాలకొల్లు సెంట్రల్: పహల్గామ్‌లో పర్యాటకులను అత్యంత దారుణంగా హతమార్చిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం రాత్రి స్థానిక గాంధీబొమ్మల సెంటర్ వద్ద కొవ్వొత్తుల ప్రదర్శనతో మృతులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి పసుపులేటి చినబాబు మాట్లాడుతూ దేశంలో మళ్లీ ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేలా కేంద్ర ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పసల బోసు, పసుపులేటి నందబాబు, పలివెల పైడియ్య, టి.శ్రీనివాస్, యు.ప్రభాకర్, ఆకుమర్తి మోషే, సిర్రా అజయ్, సిద్దుల గాంధీ తదితరులు పాల్గొన్నారు.

### మహిళలకు ఉచిత క్యాన్సర్ శిబిరం



క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల కోసం బస్సు వద్ద నిలబడిన మహిళలు క్లబ్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: రోటరీ క్లబ్, మానవత సంయుక్త ఆధ్వర్యంలో మద్దాల రాంప్రసాద్, వాసుల ఆర్థిక సహకారంతో మహిళలకు ఉచిత క్యాన్సర్ క్యాంపు ఏర్పాటు చేశారు. ఆదివారం మండలంలోని ఉల్లంపర్రు మాంటిస్సోరిస్, సబితా కళాశాల ఆవరణలో నిర్వహించిన ఈ క్యాంపులో 226 మంది మహిళలు క్యాన్సర్ పరీక్షలు చేయించుకున్నారని క్లబ్ అధ్యక్షులు రావాడ సతీష్ తెలిపారు. ముందుగా స్థానిక విజయ ల్యాబ్ సిబ్బంది బీపీ, సుగర్ పరీక్షలు చేశారు. అనంతరం మణిపాల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి బృందం వైద్యులు బస్సులో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కొమ్ముల మురళీకృష్ణ, పెనుమాక రామ్మోహనరావు, గుడాల హరిబాబు, యిమ్మిడి రాజేష్, కానూరి ప్రభాకర్, ముత్యాల శ్రీనివాసు, ముత్యాల రామారావు, మేడికొండ రామదాసు, బొక్కా రమాకాంత్, శిరిగినీడి నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

### మే డే పోస్టర్ల ఆవిష్కరణ



కొడమంచిలిలో మేడే పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

పెనుగొండ: మేడే స్ఫూర్తితో కార్మికులు పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని దినం హక్కులను కాపాడుకోవడానికి ప్రతి కార్మికుడూ నడుం బిగించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కేతా గోపాలన్ అన్నారు. ఆదివారం మేడేను విజయవంతం చేయాలని కోరుతూ కొడమంచిలిలో కార్మికులతో కలసి పోస్టర్ ఆవిష్కరించారు. దశాబ్దాలుగా కార్మిక వర్గం పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను కాలరాసేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు లేబర్ కోడ్లను తీసుకువచ్చాయన్నారు. 8 గంటల పనిదినం స్థానంలో 12 నుంచి 15 గంటల పని చేసేలా పెట్టుబడిదారులు ఒత్తిడి తెస్తున్నారన్నారు. స్కీం వర్కర్లకు కనీస వేతనాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ లేకుండా వారి చేత వెట్టి చాకిరి చేయించుకుంటున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బండి రంగారావు, పి.మోహనరావు, మచ్చ సుబ్బారావు, ఇంజేటి వీరయ్య, కారిపల్లి రాజు, మచ్చ మరియమ్మ, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

### ఆలయ పునః ప్రతిష్ఠ పూజలు ప్రారంభం

పెనుమంత్ర: మండలంలోని వెలగలేరు గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ పార్వతి రామేశ్వర స్వామి ఆలయ పునః ప్రతిష్ఠ కార్యక్రమాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. మే 1న నిర్వహించే పునఃప్రతిష్ఠకు సంబంధించిన పెడపర్తికి చెందిన శైవాగమ పండితులు యలమంచిలి కృష్ణమూర్తి శివాచార్య, యలమంచిలి ప్రసాద శర్మ పర్యవేక్షణలో వైదిక కార్యక్రమాలు ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో గ్రామానికి చెందిన పలువురు ప్రముఖులు దంపతులతో సహా పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

### వరికోత మెషీన్ అడ్డగింతపై ఫిర్యాదు

ఆకివీడు: రైతువారీ పనులకు ఆటంకం కలిగిస్తే సెక్షన్ 251 ప్రకారం చర్యలు తీసుకుంటామని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వంటపాటి ఆంజనేయులు హెచ్చరించారు. మండలంలోని దుంపగడప గ్రామంలో మూలలంక, దుబ్బుకోడు ఆయుకట్టులోని రైతు కడియం ప్రసాద్ వరి కోత మిషన్ పొలంలోకి వెళ్లడంతో అడ్డుకున్న సంఘటనపై ఆ ప్రాంత రైతులు తహసీల్దార్‌కు ఆదివారం ఫిర్యాదు చేశారు. దీంతో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు హుటాహుటీన సంఘటనా స్థలానికి చేరుకుని రైతులతోనూ, వరి కోత మిషన్‌ను అడ్డుకున్న రైతు ప్రసాద్‌తో సంప్రదింపులు చేసి సమస్యను పరిష్కరించారు.

# గ్రంథాలయానికి సొంత గూడు కరువు

- నిలిచిన గ్రంథాలయ నిర్మాణ పనులు
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రూ.1.18 కోట్లతో పనుల ప్రారంభం



కాటన్ పార్కు వద్ద పునాదులకు పరిమితమైన గ్రంథాలయ నిర్మాణ పనులు




అద్దె భవనంలో ఉన్న నరసాపురం శాఖా గ్రంథాలయం

నరసాపురం: పట్టణంలో కాటన్‌పార్కు వద్ద చేపట్టిన గ్రంథాలయం నూతన భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయి. దీంతో శాఖా గ్రంథాలయానికి సొంత భవనం సమకూరాలన్న లక్ష్యం నెరవేరేలా కనిపించడంలేదు. 2023 జనవరిలో గ్రంథాలయ నిర్మాణానికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జిల్లా గ్రంథాలయ అభివృద్ధి సంస్థ ద్వారా రూ.1.28 కోట్లు మంజూరు చేసింది. దీంతో అదే ఏడాది ఏప్రిల్ నెలలో పనులు ప్రారంభించారు. ప్రభుత్వ మాజీ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు సూచన మేరకు రైల్వేస్టేషన్‌రోడ్డులోని కాటన్‌పార్కు వద్ద 25 సెంట్లు మున్సిపల్ స్థలాన్ని గ్రంథాలయం కోసం కేటాయించారు. దీంతో ఎన్నో ఏళ్ల చరిత్ర ఉన్న నరసాపురం గ్రంథాలయానికి సొంత భవనం ఏర్పాటు కాబోతుందని అందరూ భావించారు. ప్రభుత్వం మారిన తరువాత పనులు అర్ధాంతరంగా నిలిపేశారు. 1954లో నరసాపురలో గ్రంథాలయం స్థాపించారు. ప్రస్తుతం గ్రేడ్-1 గ్రంథాలయంగా కొనసాగుతోంది. ఇప్పటికీ ఈ గ్రంథాలయానికి ప్రతిరోజూ 200 మంది వరకూ రీడర్స్ వస్తారు. అయితే భవనమే అసలు సమస్యగా మారింది. అద్దె భవనంలో అరకొర వసతుల మధ్య గ్రంథాలయంలో సేవలు కొనసాగుతున్నాయి. ఇరుకు గదుల్లో, ఆరు బయట పుస్తకాలు చదవాల్సిన పరిస్థితి నెలకొంది.

**మళ్లీ మొదటికి వచ్చిన సమస్య**

ఎన్నో ఏళ్లుగా సొంత భవనం లేని గ్రంథాలయానికి ఎట్టకేలకు సొంత భవనం సమకూరుతుందనుకుంటే సమస్య మళ్లీ మొదటికి వచ్చిందని చదువరులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కూడా టీడీపీ హయంలో నిధులు అందుబాటులో ఉన్నా కూడా కనీసం స్థల సేకరణపై కూడా దృష్టి పెట్టకపోవడంతో నిర్మాణం ముందుకు సాగలేదు.దాదాపు 70 ఏళ్ల సమస్యకు ఇటీవల వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ముదునూరి ప్రసాదరాజు పరిష్కారం చూపించారనుకుంటే ప్రభుత్వం మారడంతో పనులు నిలిచిపోయి సమస్య అలాగే ఉండిపోయింది. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి నిలిచిపోయిన గ్రంథాలయ నిర్మాణ పనులను మళ్లీ మొదలు పెట్టాలని కోరుతున్నారు.

### నిర్మాణ పనులు పూర్తి చేయాలి



నరసాపురం గ్రంథాలయం పురాతనమైనది. మున్సిపాలిటీ ఏర్పడక రెండేళ్ల ముందే ఇక్కడ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. కానీ ఇప్పటి వరకూ సొంత భవనం లేకపోవడం బాధాకరం. దీనిని దృష్టిలో పెట్టుకుని గ్రంథాలయ భవనానికి మున్సిపాలిటీకి చెందిన స్థలాన్ని కేటాయించాం. అప్పటి మా ఎమ్మెల్యే ముదునూరి నిధులు మంజూరు చేయించి పనులు మొదలు పెట్టించారు. ప్రజా ఉపయోగ నిర్మాణాలను నిలిపేయడం దారుణం. గ్రంథాలయ నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయించాలి. మున్సిపాలిటీ పరంగా మా సహకారం అందిస్తాం.

–బర్రి శ్రీవెంకటరమణ, మున్సిపల్ చైర్‌పర్సన్

### నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

నరసాపురం: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ (మీ–కోసం) కార్యక్రమం యథావిధిగా నిర్వహిస్తున్నట్టు నరసాపురం ఆర్డీఓ దాసి రాజు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. డివిజన్‌లోని అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని వివరించారు. ప్రజలు తమ ఫిర్యాదులు, దరఖాస్తులు ఉదయం 10.30 గంటల నుంచి అందించాలని వివరించారు.

**పెనుమంత్రలో..**

పెనుమంత్ర: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తామని తహసీల్దార్ వై.రవికుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను అందించాలని కోరారు.

### 30న నరసాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నరసాపురం: స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని బుధవారం ఉదయం 11 గంటలకు ఏర్పాటు చేసినట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. అజెండాలోని అంశాలతో పాటుగా వార్డుల్లో నెలకొన్న సమస్యలను చర్చిస్తామని పేర్కొన్నారు. వేసవిలో మంచినీటి సమస్యలు రాకుండా చేపట్టాల్సిన చర్యలపై చర్చిస్తామని వివరించారు. సభ్యులు విధిగా హాజరుకావాలని సూచించారు.

### చర్చి స్థలంలో మున్సిపల్ ఆఫీసు సరికాదు

ఆకివీడు: క్రైస్తవ మైనార్టీకి చెందిన చర్చి స్థలంలో మున్సిపల్ కార్యాలయం నిర్మించాలని అజెండాలో పొందుపరచడం సరికాదని ఆంధ్ర బాప్టిస్టు సెంటినరీ టౌన్ కార్యదర్శి గూడపాటి జోసఫ్ అన్నారు. ఈ నెల 30వ తేదీన మున్సిపల్ సమావేశంలో అజెండాకు చర్చించనున్న సందర్భంగా ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ స్థానిక అయిభీమవరం రోడ్డులోని సర్వే నంబర్ 473లో 2.80 సెంట్లు భూమిని 1891లో క్రైక్ దొర కొనుగోలు చేసి, స్థానిక సంఘానికి అప్పగించారన్నారు. అప్పట్లోనే రిజిస్ట్రేషన్ చేయించారని, ఈ భూమికి సంబంధించిన అన్ని రికార్డులు తమ వద్ద ఉన్నాయని జోసఫ్ రాజు చెప్పారు.

### ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు



ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

నరసాపురం రూరల్: మొగల్తూరు మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న శ్రీ బండి ముత్యాలమ్మ వారి దర్శనానికి ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. వేసవి ఎండలను సైతం లెక్కచేయకుండా అమ్మవారి దర్శనానికి భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారికి తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఏర్పాట్లను ఆలయ మేనేజర్ అరుణ్‌కుమార్ తదితరులు పర్యవేక్షించారు.

## కూటమి దగాకోరు విధానాలను ఎండగట్టాలి

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి



ముదునూరికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఇంజేటి జాన్ కెనడీ, ఇతర నాయకులు

నరసాపురం: కూటమి సర్కార్ దగాకోరు విధానాలతో ప్రజలకు చేస్తున్న మోసాలను ప్రతి ఒక్కరికీ వివరించేలా వైఎస్సార్ సీపీ నాయకులు పనిచేయాలని ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు సూచించారు. వైఎస్సార్ సీపీ ప్రచార వింగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన ఇంజేటి జాన్‌కెనడీ స్థానిక పార్టీ కార్యాలయంలో ముదునూరి ప్రసాదరాజును కలసి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు చెప్పారు. ఈ సందర్భంగా ముదునూరి మాట్లాడుతూ పార్టీలో ప్రచార వింగ్ విభాగం అత్యంత కీలకమైనదన్నారు. ఎన్నో దొంగ హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం ఏ ఒక్క వాగ్దానాన్ని నెరవేర్చలేదన్నారు. ప్రజలకు జరుగుతున్న అన్యాయాలపై విస్తృతంగా ప్రచారం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం కెనడీ మాట్లాడుతూ తనకు పార్టీ అప్పగించిన పదవిని బాధ్యతతో నిర్వహిస్తానని చెప్పారు. కెనడీ వెంట వైఎస్సార్‌సీపీ దళిత విభాగం నేతలు నల్లిమిల్లి జోసఫ్, కాకిలేటి ఆనంద్(మధు), ముసూడి రత్నం, అడిదల శరత్, చిన్నం వెంకటరావు, చిలకపాటి జోసఫ్, వర్దనపు ఏసురత్నం, తణుకులు చరణ్, పాలపర్తి బోస్, కత్తిమండ నాని, ఈదా జాషువ, తాడి లక్ష్మణరావు తదితరులు ఉన్నారు.

## లివర్ ఇన్‌ఫెక్షన్స్‌పై జాగ్రత్తగా ఉండాలి

నరసాపురం: లివర్ ప్రాంకియాస్ ఇన్‌ఫెక్షన్, 24 గంటలు నొప్పి వంటి వ్యాధుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని పాలకొల్లుకు చెందిన వివేక్ హాస్పటల్ వైద్యుడు డాక్టర్ డి.సామ్ వివేక్ సూచించారు. నరసాపురం పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక వైఎన్ కళాశాలలో పలు వ్యాధులు, అందుబాటులో ఉన్న ల్యాప్రోస్కోపీ వైద్య విధానం అనే అంశంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్జన్ డాక్టర్ వివేక్ ప్రాజెక్టర్ ద్వారా లివర్ ప్రాంకియాస్ నొప్పి వచ్చినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తను వివరించారు. అలాగే మత్తు పదార్థాలను బానిసలైన వారు ఎలాంటి వ్యాధులకు లోనవుతారు? ఎలాంటి వైద్య పరీక్షలు చేయించుకోవాలనే అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన పట్టణానికి చెందిన కనకం వరప్రసాద దంపతులను అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు మైలా కుమారస్వామి, గుబ్బల రామారావు, పులపర్తి అర్జునుడు, ఎస్‌కే అజీజ్ తదితరులు పాల్గొన్నారు.



కనకం ప్రసాద్‌ను సత్కరిస్తున్న పీఎంపీ అసోసియేషన్ సభ్యులు

### పేరుపాలెం బీచ్‌లో పర్యాటకుల సందడి

నరసాపురం రూరల్: మొగల్తూరు మండలం పేరుపాలెం బీచ్‌లో ఆదివారం సందర్శకుల సందడి నెలకొంది. వేసవి సెలవుల దృష్ట్యా పెద్ద సంఖ్యలో ప్రజలుకుటుంబ సమేతంగా వచ్చి బీచ్‌లో స్నానాలు చేస్తూ సేద తీరారు. స్నానాల అనంతరం తీరప్రాంతంలో ఉన్న మేరీ మాత, వేంకటేశ్వరస్వామి, అభయాంజనేయ, సాయిబాబా, మత్స్యనారాయణ, కనకదుర్గమ్మ ఆలయాలను దర్శించుకున్నారు.



పేరుపాలెం బీచ్‌లో సేద తీరుతున్న పర్యాటకులు

## క్షీరారామలింగేశ్వరుని ఆలయంలో అఖండ అన్నసమారాధన



స్వామివారి అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం అఖండ అన్నసమారాదన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ నెల 8న నిర్వహించిన శ్రీ పార్వతి సమేత శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి, శ్రీ లక్ష్మీ సమేత శ్రీ జనార్ధనస్వామి వార్ల కల్యాణ మహోత్సవాలు ముగింపు కార్యక్రమంలో భాగంగా స్వామి వారి అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ముచ్చర్ల శ్రీనివాసరావు తెలిపారు. సుమారు 12 వేల మంది భక్తులు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు పాల్గొని భక్తులకు ఓ దాత ఏర్పాటు చేసిన ఐస్‌క్రీమ్ కప్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అన్నదాన కమిటీ సభ్యులు, క్షీరారామలింగేశ్వరస్వామి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

## దివ్యాంగుడికి మిత్రుల సాయంతో షాపు ఏర్పాటు



కిరాణా షాపు వద్ద 1998-99 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

పాలకొల్లు సెంట్రల్: స్నేహితులు ఇచ్చిన సహకారంతో దివ్యాంగుడికి ఒక ఉపాధి ఏర్పడింది. ఆదివారం స్థానిక వరిదనం రోడ్డులో 1998–99 బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థులు తమ మిత్రుడు దుండి కిరణ్ కుమార్‌కు కోసం షాపును ఏర్పాటు చేశబూరు. ఈ సందర్భంగా మిత్రులు మాట్లాడుతూ 1994 నుండి 99 వరకూ 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ ఎంఎంకేఎస్‌ఎం ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసించినట్లు తెలిపారు. ఇటీవల జనవరి 12వ తేదిన 25 సంవత్సరాలు సిల్వర్ జూబ్లీ వేడుకలు చేసుకున్నామన్నారు. ఆ రోజు తమ మిత్రుడు కిరణ్ కుమార్ పరిస్థితి చూసి వేడుకలను ఆర్భాటంగా కాకుండా మామూలుగా చేసుకోవాలని నిర్ణయించుకున్నామన్నారు. వేడుకలు ముగిసిన అనంతరం మిగిలిన నగదుతో కిరణ్ కుమార్‌కు ఏదో వ్యాపారం ఏర్పాటు చేయాలని నిర్ణయించామని వివరించారు. ఈ మేరకు ఆదివారం సుమారు లక్ష రూపాయలతో ఓ షాపు ఏర్పాటు చేసి అందులో కిరాణా, సోడా షాపునకు సంబంధించిన మెటీరియల్‌ను ఏర్పాటు చేసి ఉపాధి కల్పించామన్నారు. ఈ షాపును మంత్రి నిమ్మల రామానాయుడు, వైఎస్సార్ సీపీ నాయకులు గుణ్ణం నాగబాబు, జనసేన నాయకులు తులా రామలింగేశ్వరరావులు ప్రారంభించారని తెలిపారు.

## మారమ్మ వారికి వెండి ఆభరణాల సమర్పణ

యలమంచిలి: బూరుగుపల్లి పంచాయతీ మట్టవానిచెరువు గ్రామదేవత మారమ్మ వారి జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి అమ్మవారి జాతర బుట్టబొమ్మలు, శక్తి వేషాలు, తీన్‌మార్ డప్పులు, గరగల నృత్యాలు నడుమ ఘనంగా నిర్వహించారు. ఆదివారం నుంచి బుధవారం వరకు అమ్మవారి తీర్థం జరుగుతుంది. ఈ సందర్భంగా అమ్మవారిని భక్తులు దర్శించుకుని మొక్కలు తీర్చుకుంటున్నారు. ఎంపీటీసీ సభ్యురాలు కడలి వెంకట సుబ్బలక్ష్మీ, ఏడుకొండలు దంపతులు అమ్మవారికి వెండితో చేసిన కళ్లు, ముక్కుపుడక, బొట్టు బిళ్ల సమర్పించారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు గుబ్బల శ్రీనివాస్, కంబాల శ్రీనివాస్, చెల్లింకుల శ్రీనివాస్, మామిడిశెట్టి శ్రీనివాస్, కుడుపూడి శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.



మారమ్మ వారికి వెండి ఆభరణాలను అలంకరిస్తున్న కడలి వెంకట సుబ్బలక్ష్మీ, ఏడుకొండలు దంపతులు

### 30 లోపు ఈ-కేవైసీ చేయించుకోవాలి

యలమంచిలి: రేషన్ లబ్ధిదారులంతా ఈ నెల 30 లోపు ఈ–కేవైసీ చేయించుకోవాలని తహసీల్దార్ గ్రంధి నాగ వెంకట పవన్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చాలామంది ఈ–కేవైసీ వేశారని, ఇంకా 4100 మంది పెండింగ్‌లో ఉన్నారని పేర్కొన్నారు. వారందరి వివరాలు రేషన్ డీలర్ల వద్ద ఉన్నాయని వివరించారు. లబ్ధిదారులు వాటిని పరిశీలించుకుని జాబితాలో వారి కుటుంబ సభ్యులలో ఎవరి పేరైనా ఉంటే వెంటనే వారి వేలిముద్రలు ఈ–పోస్ యంత్రంలో వేయించాలని కోరారు.

### విద్యార్థికి వాకర్స్ క్లబ్ సభ్యుల సాయం



విద్యార్థికి ఆర్థిక సహాయం అందిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: పట్టణానికి చెందిన విద్యార్థి యాదంరెడ్డి సంతోష్ ఆదిత్య ఇటీవల విడుదలైన జూనియర్ ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ చూపడం అభినందనీయమని వాకర్స్ క్లబ్ సభ్యులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక కుళాయి చెరువు గట్టు వద్ద విద్యార్థికి ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరానికి సంబంధించి పుస్తకాల నిమిత్తం రూ.9 వేలను వాకర్స్ క్లబ్ సభ్యులు అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు తటవర్తి సుధాకరరావు మాట్లాడుతూ విద్య, వైద్యంలో ఆర్థికంగా వెనుకబడిన వారిని ఆదుకోవడంలో తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి షేక్ పీర్‌సాహెబ్, ఉపాధ్యక్షుడు మానెం బసవరాజు, కోశాధికారి పోతుల ఉమాశంకరరావు, ధనాని శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## చెరువులకు జలకళ

యలమంచిలి: వేసవిలో ప్రజలకు తాగునీటికి ఎద్దడి రాకుండా ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులు చర్యలు తీసుకున్నారు. దీంతో మండలంలోని మంచినీటి చెరువులన్నీ పూర్తిగా నీటితో కళకళలాడుతున్నాయి. మండలంలో మొత్తం 32 గ్రామాలుండగా 16 గ్రామాల్లో మంచినీటి చెరువులు, 16 గ్రామాల్లో బోరుల ద్వారా మంచినీటి సరఫరా జరుగుతుంది. ఈ నెల 25న కాలువలు మూసివేశారు. ఈ నేపథ్యంలో వేసవిలో ప్రజలకు, పశువులకు తాగునీటి ఎద్దడి తలెత్తకుండా మంచినీటి చెరువులను, పశువుల చెరువులను పూర్తి స్థాయిలో నింపినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వి.వెంకటరమణ తెలిపారు. మూడు శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఆయిల్ ఇంజన్లు పెట్టి నీరు తోడి చెరువులను పూర్తి స్థాయిలో నింపారు. పెనుమర్రు, కట్టుపాలెం, నేరేడుమిల్లి, శిరగాలపల్లి, మేడపాడు, అడవిపాలెం, కొంతేరు, కాజ పడమర, కాజ తూర్పు, ఊటాడ, కలగంపూడి, ఆర్యపేట, యలమంచిలి, చించినాడ, ఏనుగువానిలంక, బాడవ గ్రామాల్లో చెరువలన్నీ పూర్తి స్థాయిలో నిండాయి. మరొక నెల రోజుల వరకు గ్రామాల్లో తాగునీటి సరఫరాకు ఎటువంటి ఆటంకం ఉందని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వి.వెంకటరమణ తెలిపారు. చిన్న చెరువులున్న గ్రామాల్లో చెరువులో నీరు నిండుకుంటే ట్యాంకర్ల ద్వారా మంచినీరు సరఫరా చేసేందుకు సంబంధిత గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలిచ్చినట్లు ఆయన చెప్పారు.



మేడపాడులో నీటితో నిండు కుండలా ఉన్న మంచినీటి చెరువు



నేరేడుమిల్లిలో పూర్తిగా నీటితో నిండిన మంచినీటి చెరువు



కలగంపూడిలో కళకళలాడుతున్న చెరువు